క్లుప్తంగా

పలకరింపులు.. పరామర్శలు



రెడ్డెప్పనాయుడును పరామర్శిస్తున్న హర్షిత్‌రెడ్డి

తిరుపతి రూరల్‌ : చంద్రగిరి నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలను పార్టీ ఉమ్మడి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గురువారం పరామర్శించారు. తిరుపతి రూరల్‌ మండలం కేసీపేటకు చెందిన రామ్మూర్తి రెడ్డి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డిని పరామర్శించి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకున్నారు. తిరుమలనగర్‌ పంచాయతీకి చెందిన శివశంకర్‌రాజు మనుమరాలు కేశకండన కార్యక్రమానికి హాజరయ్యారు. ఎర్రావారిపాళెం మండలం యల్లమందకు చెందిన రెడ్డెప్పనాయుడును పరామర్శించారు. రామచంద్రాపురం మండలానికి చెందిన జర్నలిస్టు మణి తల్లి లక్ష్మమ్మ మృతి చెందడంతో ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు.

స్వీయ రక్షణపై శిక్షణ



విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్‌

తిరుపతి రూరల్‌ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గురువారం సెల్ఫ్‌ డిఫెన్స్‌పై విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. డీన్‌ ఆఫ్‌ స్టూడెంట్‌ అఫైర్స్‌ ప్రొఫెసర్‌ ఉషారాణి మాట్లాడుతుతూ సమాజంలో మహిళల భద్రతకు స్వీయ రక్షణ పద్ధతులు నేర్చుకోవడం అవసరమన్నారు. ఎక్కడ ఉన్నా, ఏ పరిస్థితిలో ఉన్నా, తనను తాను కాపాడుకునే సామర్థ్యం కలిగి ఉండాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ నీరజ, కరాటే స్కూల్‌ ఆఫ్‌ ఇండియా వైస్‌ ప్రెసిడెంట్‌ రత్నాకర్‌ పాల్గొన్నారు.

20 మంది రక్తదానం



సర్టిఫికెట్లతో యువకులు

తిరుపతి తుడా : కృష్ణానగర్‌కు చెందిన ఎస్‌కేఎస్‌ బాయ్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో బుధవారం సుమారు 20 మంది యువకులు రక్తదానం చేశారు. వినాయక చవితి సందర్భంగా ఎన్టీఆర్‌ బ్లడ్‌ బ్యాంకుకు రక్తం యూనిట్లు అందజేశారు. ఈ మేరకు బ్లడ్‌ బ్యాంకు వారు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల యువరాజు కృష్ణ ఆర్‌ భూపాల్‌

తిరుమల : తిరుమల శ్రీవారిని గురువార పలువురు ప్రముఖులు సేవించుకున్నారు. వీరిలో మంత్రి కొల్లు రవీంద్ర, కేంద్ర మాజీ మంత్రి అన్బుమణి రాందాసు, గద్వాల్‌ సంస్థానం యువరాజు కృష్ణ ఆర్‌ భూపాల్‌ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అమరవీరులకు నివాళి



నివాళులర్పిస్తున్న నేతలు

పాకాల : బషీర్‌బాగ్‌ కాల్పుల ఘటనలో ప్రాణాలర్పించిన అమరవీరులకు గురువారం స్థానిక సంతగేటు వద్ద సీపీఎం నేతలు ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి మధుసూదన్‌రావు మాట్లాడుతూ విద్యుత్‌ పోరాటంలో ముగ్గురు యోధులు మృతి చెంది 25ఏళ్లు గడించినట్లు వెల్లడించారు.ఈ క్రమంలో స్మార్ట్‌మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పెంచిన విద్యుత్‌ చార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని డిమాండ్‌ చేశారు. నేతలు నరేంద్ర, వేణు, వెంకటరమణ, రాజు, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఇంటి స్థలాల మంజూరుకు డిమాండ్‌

తిరుపతి అన్నమయ్యసర్కిల్‌ : టీటీడీలోని అర్చకులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్‌ డిమాండ్‌ చేశారు. గురువారం స్థానిక టీటీడీ పరిపాలన భవనం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అర్చకులందరికీ 5 సెంట్ల చొప్పున స్థలాలు కేటాయించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు కనీసం రూ.18,600లు వేతనం ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్‌ నేతలు యార్లపల్లి గోపీగౌడ్‌, రవి, తేజోవతి, ముని శోభ, రావణ్‌, యార్లగడ్డ గోపి పాల్గొన్నారు

గణేశం.. సర్వేశం

ఆదిదేవా శిరసాస్మరామి.. మూషిక వాహనా సదా నమామి.. పార్వతీ తనయా ప్రణామి..అంటూ వినాయక చవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో బుధవారం జరుపుకున్నారు. వాడ వాడలా కొలువుదీరిన గణపతి ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటా మట్టి గణనాథుని విగ్రహాలను ప్రతిష్టించుకున్నారు. విశేష పత్రితో స్వామిని అర్చించారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. విద్యాబుద్ధులు ప్రసాదించాలని పిల్లలు ప్రార్థించారు. ఈ క్రమంలోనే గురువారం పలు ప్రాంతాల్లో పూజలందుకున్న విఘ్నేశ్వరుని ఊరేగింపుగా తీసుకెళ్లి పవిత్రజలాల్లో నిమజ్జనం చేశారు.

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా కొలువుదీరిన గణపతి ప్రతిమలు
- పలుచోట్ల ఘనంగా నిమజ్జనోత్సవాలు

తుంబుర గణపతి సేవలో భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి





చిట్టి చేతుల్లో..



చంద్రగిరిలో..

తిరుపతి కల్చరల్‌/తిరుమల/తిరుపతి తుడా/ తిరుపతి రూరల్‌/ చంద్రగిరి/ పాకాల : తెలుగువారి తొలి పండుగ వినాయక చవితిని బుధవారం తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వాడవాడల ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో వివిధ రూపాలతో భారీ వినాయక విగ్రహాలను కొలువుదీర్చి కొలిచారు. ప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానాలు చేపట్టారు. రెండవ రోజు గురువారం కూడా ఉదయం నుంచి రాత్రి వరకు చవితి వేడుకలు కోలాహలంగా సాగాయి. యువత కేరింతుల కొడుతూ నృత్యాలతో హోరెత్తించారు. పలు చోట్ల నిమజ్జనాలను వైభవంగా చేపట్టారు.

తిరుమల ఘాట్‌ రోడ్లలో..

తిరుమల : తిరుమల ఘాట్‌ రోడ్లలోని వినాయక స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

తుంబుర గణపతి దర్శనానికి పోటెత్తిన భక్తులు

తిరుపతి రూరల్‌ : తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసియున్న తుంబుర వినాయకుని ప్రతిమను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి పర్యవేక్షణలో కొలువుదీర్చిన తుంబర వినాయకుని ప్రతిమ చూడముచ్చటగా దర్శనమిచ్చింది. వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీస్సులు అందజేశారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

వినాయక సాగర్‌లో గణేశ్‌ నిమజ్జన ఏర్పాట్లను కమిషనర్‌ మౌర్య బుధవారం రాత్రి పరిశీలించారు. నిమజ్జన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.



వినాయకసాగర్‌ వద్ద జన సందోహం



బైబై గణేశా..



సెల్ఫీ తీసుకుంటూ..



నిమజ్జనానికి ముందు వినాయకుడికి పూజ

వన్య ప్రాణుల సంరక్షణపై సమీక్ష



సమీక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుపతి అన్నమయ్యసర్కిల్‌ : తిరుమలలో అటవీ సంపద పెరుగుదల, వన్య ప్రాణుల సంరక్షణ చర్యలపై అటవీశాఖ అధికారులతో గరువారం తిరుపతిలోని పరిపాలన భవనంలో టీటీడీ ఈవో శ్యామలరావు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ డీఎఫ్‌ఓ ఫణికుమార్‌ నాయుడు గత ఏడాది తిరుమలలో చేపట్టిన కార్యక్రమాలు, దశల వారీగా అకేసియా ఆరికులిఫార్మిస్‌ వృక్షాల స్థానంలో స్థానిక వృక్షజాతుల పెంపకం, ఔషధ వనాల అభివృద్ధి, సుస్థిర అటవీ పునరుద్ధరణ చర్యలు వంటి అంశాలపై పవర్‌పాయింట్‌ ప్రజెంటేషన్‌ ఇచ్చారు. వాటర్‌షెడ్‌, మట్టి స్థిరీకరణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. ఈవో శ్యామలరావు మాట్లాడుతూ.. వన్యప్రాణుల నిర్వహణలో భాగంగా, అలిపిరి–తిరుమల మార్గాల రెండు వైపులా 60 కెమెరా ట్రాపులు, 31 సౌర శక్తితో నడిచే యాక్టివ్‌ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమీక్షలో జేఈఓ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

ఘనంగా ‘ఉత్కల’ ఉత్సవం



మాట్లాడుతున్న అతిథులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో గురువారం నువకాయ్‌ ఉత్కల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ గ్లోబల్‌ లా ఇనిస్టిట్యూట్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ విజయకుమార్‌ బెహరా విచ్చేశారు. వీసీ జీఎస్‌ఆర్‌ కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని సంరక్షించడమే వర్సిటీ లక్ష్యమని తెలిపారు.అకడమిక్‌ డీన్‌ ప్రొఫెసర్‌ రజనీకాంత్‌ శుక్లా, రిజిస్ట్రార్‌ కడియం వెంకట నారాయణరావు, ప్రొఫెసర్‌ రంగనాథన్‌, ఫైనాన్స్‌ ఆఫీసర్‌ రాధా గోవింద త్రిపాఠి పాల్గొన్నారు,

ఉపరాష్ట్రపతి అభ్యర్థికి అభినందన



రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పీసీ రాయులు

తిరుపతి కల్చరల్‌ : ఎన్‌డీఏ ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను కస్తూర్బా గాంధీ ట్రస్ట్‌ చైర్మన్‌ డాక్టర్‌ పీసీ రాయులు బుధవారం మర్యాపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్న సీపీ రాధాకృష్ణన్‌కు పీసీ.రాయులు పుష్పగుచ్ఛం అందజేశారు.

మెడికల్‌ కళాశాల వసతిగృహంలో అగంతకుడి కలకలం



అగంతుకుడి హల్‌ చల్‌

తిరుపతి తుడా : ఎస్వీ మెడికల్‌ కళాశాల హౌస్‌ సర్జన్‌ హాస్టల్‌లోకి ఓ అగంతకుడు చొరబడిన ఘటన గురువారం రాత్రి 8 గంటల సమయంలో చోటు చేసుకుంది. హాస్టల్‌ లోని వైద్య విద్యార్థుల వద్ద దొంగతనం చేసేందుకు గుర్తుతెలియని వ్యక్తి చొరబడ్డాడు. ఈ క్రమంలో సమీపంలో ఉన్న వైద్య విద్యార్థులు దొంగను గుర్తించారు. అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది అలెర్ట్‌ అవ్వడంతో అగంతకుడిని లోపలికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఆ వ్యక్తిని పట్టుకునేందుకు సెక్యూరిటీ సిబ్బంది గేట్లు వేశారు. పోలీసులు సమాచారం అందుకుని వచ్చేలోపు అగంతకుడు తప్పించుకు పారిపోయాడు. సెక్యూరిటీ సిబ్బంది గుంపుగా ఏర్పడి అతడి కోసం రుయా పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

స్మార్ట్‌మీటర్ల రద్దుకు పోరాటం



మాట్లాడుతున్న రామానాయుడు

తిరుపతి కల్చరల్‌ : స్మార్ట్‌మీటర్లను రద్దు చేసేంత వరకు పోరాటం కొనసాగిస్తామని, విద్యుత్‌ చార్జీలను పెంచి ప్రజలపై భారం మోపడం దారుణమని వామ పక్ష నేతలు మండిపడ్డారు. గురువారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో విద్యుత్‌ పోరాటంలో ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.రామానాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీపీఐ ఎంఎల్‌ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్‌. హరికృష్ణ మాట్లాడుతూ విద్యుత్‌ చార్జీల పెంపును నిరసిస్తూ 2000 ఆగస్టు 28న చలో హైదరాబాద్‌ చేపడితే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం విచక్షణా రహితంగా కాల్పులు జరిపి రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిని పొట్టన పెట్టుకుందని ధ్వజమెత్తారు. ఇప్పుడు స్మార్ట్‌ మీటర్ల పేరుతో దోపిడీకి శ్రీకారం చుట్టారని ఆరోపించారు.

లంకెల బద్రీనాథ్‌కు సత్కారం



బద్రీనాథ్‌ను సన్మానిస్తున్న మురళీమోహన్‌ తదితరులు

తిరుపతి మంగళం : అమెరికాలో 24 జిల్లాల కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న లంకెల బద్రీనాథ్‌ను జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్‌, ఇతర అధికారులు గురువారం ఘనంగా సత్కరించారు. బద్రీనాథ్‌ మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్టు ఇంజినీరింగ్‌లో స్పెషలైజేషన్‌ చేస్తున్నానని, అందులో భాగంగా రవాణా శాఖ విధివిధానాలను తెలుసుకున్నట్లు వెల్లడించారు. రోడ్డు భద్రత, వాహన తనిఖీలపై జిల్లా రవాణా శాఖ అధికారి వివరించారు. ఎంవీఐలు శ్రీనివాసరావు , అతికానాజ్‌, అధికారులు విజయ్‌ కుమార్‌ విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

నోటీస్‌ బోర్డు

- అక్టోబర్‌కు సంబంధించి తిరుమల శ్రీవారి సేవ, నవనీత సేవ, పరకామణి సేవ, తిరుమలకు గ్రూప్‌ సూపర్‌వైజర్‌ సేవలకు ఆన్‌లైన్‌ కోటా టికెట్లు ఉదయం 11 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల.
- శంకరంబాడి సాహితీ పీఠం ఆధ్వర్యంలో మధురానగర్‌లోని సెవన్‌ హిల్స్‌ హైస్కూల్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు తెలుగు భాషా దినోత్సవం.
- జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ కార్యాలయంలో సాయంత్రం 5 గంటలకు మాతృభాషా దినోత్సవం.

నేడు మండల మీట్‌

రామచంద్రాపురం : మండల పరిషత్‌ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్‌ రెడ్డి గురువారం తెలిపారు. ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి అధ్యక్షతన చేపట్టే సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

జనవరిలో 22వ కాన్వొకేషన్‌

తిరుపతి రూరల్‌ : పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 22వ కాన్వొకేషన్‌ను 2026 జనవరిలో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ రజని గురువారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

1 నుంచి హరికథ కళాకారులకు శిక్షణ

తిరుపతి అన్నమయ్యసర్కిల్‌ : హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతిని ఈ నెల 31వ తేదీన మహతి కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది. సెప్టెంబరు 1 నుంచి 10వ తేదీ వరకు హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో 180 మంది హరికథ కళాకారులకు హరికథ వైభవం పేరిట శ్వేత భవనంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొంది. కళాకారులకు ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు వెల్లడించింది.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తిరుపతి తుడా : నగరంలో ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించాలని కమిషనర్‌ మౌర్య ఆదేశించారు. గురువారం శ్రీగోవిందరాజ స్వామి మాడా వీధులు, రైల్వే స్టేషన్‌, పీజీఆర్‌ థియేటర్‌ రోడ్డు, పీకే లేఔట్‌ తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్‌ మాట్లాడుతూ తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. మాడవీధుల్లోని అన్ని దుకాణాల వద్ద చెత్తబుట్టను ఏర్పాటు చేయించాలని స్పష్టం చేశారు. శానిటరీ సూపర్‌ వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు.

విజిలెన్స్‌ విచారణకు డిమాండ్‌

తిరుపతి తుడా : డ్వాక్రా మహిళలు పొదుపు చేసుకున్న డబ్బును స్వాహా చేసిన ఆర్‌పీలను వెనకేసుకు వస్తున్న మెప్మా అధికారులపై వెంటనే విజిలెన్స్‌ విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్‌ చేశారు. చింతల చేనులో ఒక రిసోర్స్‌ పర్సన్‌ రూ.40 లక్షలు తినేసినట్లుగా బయటపడితే అధికారులు గుట్టుచప్పుడు కాకుండా అణగదొక్కడం దారుణమన్నారు. మూడో డివిజన్‌లో మరొకరు రూ.కోటి స్వాహా చేసేంతవరకు అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించారని మండిపడ్డారు. కొర్లగుంటలో రూ.10లక్షలు, బాలాజీ సమైఖ్యలో రూ.80లక్షలు, తెలుగుతల్లి సమైఖ్యలో రూ.62లక్షలు స్వాహా చేసినట్లు వార్తలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బాధ్యత లేని అధికారులను సస్పెండ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు.

‘అన్నమాచార్య’లో క్వాంటమ్‌ హ్యాకథాన్‌



టెక్నాలజీపై మాట్లాడుతున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ అండ్‌ సైన్సెస్‌లో గురువారం అంతర్గత హ్యాకథాన్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా క్వాంటమ్‌ టెక్నాలజీ ఆధారిత సమస్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు కళాశాలలకు చెందిన విద్యార్థులకు క్వాంటమ్‌ హాకథాన్‌పై నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపల్‌ డాక్టర్‌ నాధమునిరెడ్డి పాల్గొన్నారు,

పల్లె పల్లెలో చెవిరెడ్డి స్మరణ

- చవితి వేడుకల్లో చెవిరెడ్డి లేని లోటు కనిపిస్తోంది..
- పదేళ్ల తర్వాత చందాలు అడగాల్సి వచ్చింది
- వినాయక ఉత్సవ కమిటీల ఆవేదన

తిరుపతి రూరల్‌ : చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అందుబాటులో లేని లోటు వినాయక చవితి వేడుకల్లో స్పష్టంగా కనిపిస్తోందని గణేష్‌ ఉత్సవ కమిటీలు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో భారీ గణపతి విగ్రహాలను సైతం ఆయన ఉచితంగా అందించేవారని గుర్తుచేసుకుంటున్నాయి. పదేళ్ల తర్వాత చవిత సంబరాల నిర్వహణకు చందాలు వసూలు చేయాల్సి వచ్చిందని వాపోతున్నాయి. చంద్రగిరి నియోజకవర్గ ప్రజల పెద్దదిక్కు చెవిరెడ్డిని జైలు నుంచి బయటకు తీసుకురా గణేశా.. అంటూ పల్లె పల్లె వేడుకుంటోందని వివరిస్తున్నాయి. వినాయక చవితి పర్వదినాన గణపతి ప్రతిమలకు ప్రత్యేక పూజలు చేసి చెవిరెడ్డిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నాయి. చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లోని యువత తమ అభిమాన నేత చెవిరెడ్డి కోసం పలు చోట్ల గణనాథునికి పుష్పాభిషేకం చేసింది.



చిట్టేచర్లలో..



తుమ్మలగుంటలో చెవిరెడ్డి కోసం పూజలు చేస్తున్న యువత

చెవిరెడ్డిని కాపాడాలని వేడుకున్నాం..



మా అందరి అభిమాన నేత చెవిరెడ్డి. ప్రజలకు మంచి చేయడం మాత్రమే ఆయనకు తెలుసు. అక్రమంగా జైలులో 70 రోజులకు పైగా చెవిరెడ్డిని నిర్బంధించారు. ఆయనను త్వరగా బయటకు వచ్చేలా చేయాలని గణనాథుడిని ప్రార్థించాం. చవితి వేడుకల్లో ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది.

– నల్లందుల సుజిత్‌రెడ్డి, తుమ్మలగుంట, తిరుపతి రూరల్‌

విగ్రహాలు ఉచితంగా ఇచ్చేవారు



ఏటా మా గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాటు చేసే భారీ గణపతి ప్రతిమలను చెవిరెడ్డి ఉచితంగా పంపించేవారు. దీంతో ఆనందంగా 9 రోజుల పాటు వినాయకుడికి పూజలు చేసుకునే వాళ్లం. ఇప్పుడు ఆయన లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. చందాలతో వసూలు చేసిన డబ్బులు విగ్రహానికి సరిపోయాయి. అందుకే 5 రోజులకే పూజలు ముగించేస్తున్నాం.

– హరి, రేఖలచేను, రామచంద్రాపురం మండలం

చెవిరెడ్డి ఆరోగ్యం కాపాడాలని..



అక్రమంగా జైలులో నిర్బంధించిన చెవిరెడ్డి ఆరోగ్యం బాగుండాలని, ఆయనను త్వరగా ప్రజల మధ్యకు తీసుకురావాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించాం. చవితి వేడుకలకు చెవిరెడ్డిని దూరం చేసినా ప్రజల గుండెల్లో మాత్రం ఆయన స్థానం పదిలం. చవితి నాడు ఆయనను తలుచుకోనివారు లేరు. ఉచితంగా మట్టి విగ్రహాలను ప్రతి ఇంటికీ పంపించేవారు.

– మనోజ్‌కుమార్‌, చినిగేపల్లె, చిన్నగొట్టిగల్లు మండలం

జనం మధ్య ఉండాలి



చెవిరెడ్డిని బయటకు తీసుకురావాలని గణపతికి నివేదించాం. ఆయన జనం మధ్యన ఉండాలని స్వామివారిని పూజించాం. మా గ్రామంలోని విఘ్నేశ్వరుని ఆలయంలో అభిషేకం చేశాం. చెవిరెడ్డి వంటి మంచి మనస్సున్న నాయకుడిని కడిగిన ముత్యంలా ప్రజలకు ముంగిటకు తీసుకురావాలని కోరుకున్నాం.

– అంజి, చెన్నుగారిపల్లె, పాకాల మండలం